ప్రజాభిప్రాయం ప్రతిబింబించేలా సర్వే చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): భవిష్యత్ తరాలకు మెరుగైన సమాజం అందించేందుకు ప్రత్యేకమైన జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందిచేందుకు సర్వే జరుగుతోందని, ప్రజాభిప్రాయం ప్రతిబింబించే విధంగా సర్వే చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జనాభా నిర్వహణ విధానంపై జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఏఎస్‌ఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభా నిర్వహణ విధానాన్ని చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ పేపర్‌ను విడుదల చేసిందన్నారు. జనాభా గణనీయంగా తగ్గుముఖం పట్టే ట్రెండ్‌లో ఉందని, అందువల్ల ముఖ్యమంత్రి మేలుకొలుపుగా ఈ కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. 2025లో దేశంలో 141 కోట్ల జనాభా ఉందని, ఇదే బర్త్ రేట్‌తో కొనసాగితే 2061లో 165 కోట్లకు, 2100 నాటికీ 144 కోట్లకు జనాభా చేరుకుంటుందన్నారు. పెళ్లి చేసుకోకుండా ఉండడం, 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం, లైఫ్ ఎక్స్‌పెక్టెన్సీ పెరిగిపోవడం వంటివి కారణాలన్నారు. డ్రాఫ్ట్ డాక్యుమెంటేషన్‌లో ఇచ్చిన ఇండికేటర్ల ప్రకారం 2011–15 మధ్య జనాభా పెరుగుదల రేటు 7.1 శాతం ఉంటే 2031–35 మధ్య 0.3 శాతానికి పడిపోతుందని వివరించారు. 2011–15 మధ్య క్రూడ్ బర్త్ రేట్ 15.2 శాతం ఉంటే 2031–35 నాటికీ 9.9 శాతానికి వస్తుందన్నారు. 2011–15 మధ్య మరణాల రేటు 7.8 శాతం ఉంటే 2031–35 మధ్య 9.5 శాతానికి వస్తుందన్నారు. 2011–15 మధ్య సంతానోత్పత్తి 1.68 శాతం నుంచి ఇప్పటికీ 1.51 శాతం ఉందన్నారు. జనన రేటు తగ్గడం, పెళ్లి చేసుకునే వయసు పెరగడంతో జనాభా తగ్గిపోతోందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా 9 ప్రశ్నలు ఇచ్చారని, వాటికి సమాధానాలుగా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ శాంతికళ, సీపీఓ హిమప్రభాకరరాజు, ఐసీడీఎస్ పీడీ నిర్మల, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్‌నాయక్, మెప్మా పీడీ నాగశివలీల, టూరిజం అధికారి విజయ పాల్గొన్నారు.



జనాభా సర్వేపై ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

దేవదాయ శాఖ ఈఓల బదిలీ

కర్నూలు కల్చరల్: ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా దేవదాయ శాఖలో పలువురు ఈఓలు బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌గా ఉన్న కె.ఆదిశేషు నాయుడును విజయవాడ హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సి.తిరుమల్‌రెడ్డికి అనంతపురం ఏసీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అదే ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కర్నూలు గ్రూప్–3 టెంపుల్స్ గ్రేడ్–3 ఈఓ దినేష్‌కు బళ్లారి చౌరస్తా వీరాంజయనేస్వామి దేవాలయం ఈఓగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న గ్రేడ్–3 ఈఓ ఆదిజంబులమ్మకు జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర ఆలయం ఈఓగా, ఆదోని గ్రూప్ టెంపుల్స్ ఈఓ రాధాకృష్ణకు వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం ఈఓగా బాధ్యతలు అప్పగిస్తూ ఆదోని గ్రూప్ టెంపుల్స్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

గంగమ్మకు పూజలు


కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న రజక వృత్తిదారులు

కర్నూలు(సెంట్రల్): హంద్రీ నది ఒడ్డున గంగమ్మకు రజక వృత్తిదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి జూన్‌లో ముజఫర్ నగర్‌లో ఉండే రజక వృత్తిదారులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనావాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం కాలనీలోని రజక వృత్తిదార కుటుంబీకులు గంగమ్మను ఇంటింటా తిప్పి నది ఒడ్డున ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృత్తిరీత్యా నిత్యం నీళ్లలో ఉండే తమపై గంగమ్మ తల్లి అనుగ్రహం ఉండాలని కోరుకుంటూ పూజలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రజకదారుల వృత్తి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్, న్యూసిటీ కార్యదర్శి సి.శేషాద్రి చెప్పారు.

ఆరోగ్యానికి యోగా దివ్యౌషధం


యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ మేనేజర్, చిన్నారులు

కర్నూలు (టౌన్): సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని ఖానా ఖజానా వద్ద స్ట్రీట్ యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా జీవించడానికి యోగాసనాలను నిత్యం ఆచరించాలన్నారు. ప్రజలకు యోగాపై మరింత అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతోందని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి సచివాలయ పరిధిలో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నామని, నగర ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

సీనియర్ వైద్యురాలి మృతి


స్నేహలతా రెడ్డి (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.స్నేహలతా రెడ్డి (76) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. గత ఏడాదిన్నర కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆమె చికిత్స పొందుతున్నారు. కర్నూలు నగరంలోని జొహరాపురం రోడ్డులో ఉన్న ఎస్వీ గ్రీన్ అవెన్యూలో ఆమె నివాసముంటున్నారు. మంగళవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఈమె భర్త డాక్టర్ ఆదినారాయణ రెడ్డి సైతం ఇదే ఆసుపత్రిలో రేడియాలజీ ప్రొఫెసర్‌గా సేవలు అందించి పదవీ విరమణ పొందారు.

జెడ్పీ పరిధిలో బదిలీలు

కర్నూలు (అర్బన్): కర్నూలు జిల్లా ప్రజాపరిషత్ పరిధిలోని ఆయా కార్యాలయాల్లో పనిచేస్తూ ఒకే స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని, బదిలీ కొరకు అభ్యర్థన దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల బదిలీలు చేపట్టినట్లు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీన జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి 64 మంది ఉద్యోగులను బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రక్రియను జూన్ 9వ తేదీ వరకు పొడిగించినందున చైర్మన్ అనుమతితో 9 మంది ఉద్యోగులకు బదిలీలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీడీఓలు ఇద్దరు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 2, జూనియర్ అసిస్టెంట్లు 2, ఒక టైపిస్టు, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌కు బదిలీలు కల్పించారు.

ట్రాఫిక్ హెచ్‌సీ ఆత్మహత్యాయత్నం

కర్నూలు: కర్నూలు ట్రాఫిక్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలతో తాళలేక సోమవారం రాత్రి లాడ్జిలో మద్యంలో గడ్డి మందు కలుపుకుని సేవించి అపస్మారక స్థితిలో పడి ఉండగా సహోద్యోగులు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారని, ఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


చిన్న రామప్ప (ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన బోయ చిన్న రామప్ప(42) అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చిన్న రామప్ప ఈ నెల 9న ఉదయం పొలానికని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. భర్త ఎంతకు ఇంటికి రాకపోవడంతో పొలానికి వెళ్లి చూసినా, బంధువులకు ఫోన్ చేసి విచారించిన ఆచూకీ లభించలేదు. చిన్న రామప్ప తన భార్య వెంకటేశ్వరమ్మ అన్నకి అప్పుగా డబ్బులు ఇవ్వగా సదురు డబ్బులు తిరిగి ఇవ్వపోవడంతో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి పోయినట్లు తెలిసింది. భార్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు

- సీనియారిటీని పట్టించుకుంటే ఒట్టు
- జీఓలకు వ్యతిరేకంగా ఆఫీస్ బేరర్ల బదిలీ
- జిల్లా ట్రెజరీ డీడీ ఛాంబర్ ఎదుట ఉద్యోగుల ధర్నా


జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కర్నూలు (అగ్రికల్చర్): ట్రెజరీ ఉద్యోగుల బదిలీల్లో సీనియారిటీని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లా ట్రెజరీ అధికారులు రామచంద్రరావు, లక్ష్మీదేవి, రెండు జిల్లాలకు చెందిన ఇద్దరు ఏటీఓలు ఇద్దరు ఎస్‌టీఓలు సభ్యులుగా ఉన్న కమిటీ పదవులు చేపట్టింది. అయితే ఉద్యోగుల సీనియారిటీని పట్టించుకోకుండా జూనియర్లకు పెద్దపీట వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల బదిలీల విషయంలో కూడా ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోలేదని ఉద్యోగులు ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లా ట్రెజరీ డీడీ కార్యాలయం ఎదుట బైఠాయించి కమిటీ సభ్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీఓలు ఓ రకంగా ఉంటే మరో రకంగా బదిలీలు చేపట్టారని, సీనియారిటీ పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన బదిలీలను రద్దు చేసి సీనియారిటీ ప్రాతిపదికగా జీఓలకు అనుగుణంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, ఉద్యోగుల సంఘం నేతలు పల్నాటి సునిల్, కరుణాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం కర్నూలు నగరంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయన మంగళవారం రాత్రి విజయవాడ నుంచి రైలులో బయలుదేరి డోన్ వరకు వస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కర్నూలు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో విడిది చేసి అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం రాత్రి 8 గంటలకు డోన్‌కు బయలుదేరి వెళ్తారు. అక్కడి నుంచి రాత్రి 9.05 గంటలకు రైలులో విజయవాడకు వెళ్తారు.

కార్పొరేషన్‌లో బదిలీలు

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్పొరేషన్‌లో పలువురు ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టింది. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల్లో పలువురు ఇంజినీర్లు బదిలీ అయ్యారు. టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ వి.శోభన్‌బాబును బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేశారు. ఇదే విభాగంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మస్రత్ అలీఖాన్‌ను డోన్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ టౌన్ ప్లానింగ్ సంచాలకులు విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంజినీరింగ్ విభాగంలో...

ఇంజినీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసే జి.శ్రీనివాసరెడ్డిని పులివెందుల మున్సిపాలిటీకి, అసిస్టెంట్ ఇంజినీర్లు ఎస్.భార్గవిని ఆదోని మున్సిపాలిటీకి, వి.నాగజ్యోతిని తిరుపతి మున్సిపాలిటీ, కె.గోవిందప్పను గుత్తి మున్సిపాలిటీకి, ఈ.ప్రవీణ్‌కుమార్‌ను కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ మంగళవారం ప్రజారోగ్య సాంకేతిక శాఖ చీఫ్ ఇంజినీర్ యం.ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న క్రీడా నిర్వహణ కమిటీ కో–ఆర్డినేటర్ హర్షవర్ధన్

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఉమ్మడి జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని క్రీడల నిర్వహణ కమిటీ కో–ఆర్డినేటర్ హర్షవర్ధన్ సూచించారు. అలాగే ఈనెల 22న మెగా ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం స్థానిక కర్నూలు ఆఫీసర్స్ క్లబ్‌లో ఒలింపిక్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా సంఘాల ప్రతినిధులు వారికి కేటాయించిన పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఏడాది ఒలింపిక్స్ డే పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహించడం అనవాయితీగా వస్తోందని, ఆదే స్ఫూర్తితో ఈ ఏడాది ఒలింపిక్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. నాగరత్నమయ్య (ఆర్చరీ), హర్షవర్ధన్ (అథ్లెటిక్స్), సుధీర్ (హాకీ), సువర్ణ (హ్యాండ్‌బాల్), శ్రీనివాసులు (ఫుట్‌బాల్), ప్రతాప్ (కరాటే), నబీసాహెబ్ (స్కేమార్షల్ ఆర్ట్స్), వెంకటేశ్వర్లు (తైక్వాండో), సుంకన్న (కబడ్డీ), దాదాబాషా (బాస్కెట్‌బాల్), వేణుగోపాల్ (పవర్ లిఫ్టింగ్), షేక్షావళి (వెయిట్ లిఫ్టింగ్), జాఫర్ మున్నా (వాలీబాల్), విజయ్‌కుమార్ (త్రోబాల్), రవికుమార్ (రైఫిల్ షూటింగ్) ప్రభాకర్ (యోగాసన), చంద్ర (జూడో) పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన


కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల

కర్నూలు (అర్బన్): కిశోర వికాసంపై ప్రతి విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల అన్నారు. మంగళవారం లక్ష్మీపురం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహించిన కిశోర వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రుతుక్రమ సమయంలో వచ్చే సమస్యలను ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. ఎదిగే దశలో వచ్చే మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి అనురాధ, శారద మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థినీ, విద్యార్థులకు కిశోర వికాసంపై అవగాహన కల్పించామన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులచే 18 సంవత్సరాలు నిండేంత వరకు బాలికలకు వివాహం చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ జమీల, ప్రొటెక్షన్ అధికారిణి పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ సర్పంచు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

సి.బెళగల్: చిన్న వయస్సులో పెళ్లిళ్లతో ఆరోగ్య సమస్యలు వస్తాయని జిల్లా సంచార వైద్య సేవల నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ అనీస్, వైద్య సిబ్బంది 104 సేవలలో భాగంగా గ్రామంలో చేపట్టిన వైద్య శిబిరాన్ని జిల్లా నోడల్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు వైద్య నివేదికలను పరిశీలించి ఆరోగ్య సమస్యలు, కారణాలపై వారితో మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక సమస్యలు కూడా ఉంటాయని ఆయన అన్నారు. బాల్య వివాహాలతో గర్భస్రావం, పురిటిలోనే శిశువు చనిపోవడం, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, కాన్పులు కష్టమవటం వంటి సమస్యలు వస్తాయని అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ రాజ్‌మియ్యా, సీహెచ్‌ఓ సురేఖ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

పార్కు పనులు పూర్తి చేయండి


పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని ఆనంద్ థియేటర్ సమీపంలో హంద్రీ నది ఒడ్డున డంప్ తొలగించి నిర్మిస్తున్న పాకెట్ పార్కు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన మంగళవారం పాకెట్ పార్కు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మంత్రి ఆదేశాల మేరకు రూ.10 లక్షలు వెచ్చించి పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫెన్సింగ్, గ్రావెల్ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. పచ్చదనం పనులను త్వరలోనే చేపడతామన్నారు. అంతకుముందు కమిషనర్ నగరంలోని వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, డీఈఈలు కృష్ణలత, గంగాధర్, టీపీఈలు మహేష్, మనోజ్ పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీగా జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీగా జయలక్ష్మి పోస్టు పదిలం అయ్యింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఆమె అనంతపురం మార్కెట్ కమిటీ సెక్రటరీగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆన్ డ్యూటీపై కర్నూలు మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా ఇక పూర్తిస్థాయి సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు ఏరువాక పున్నమి వేడుకలు

కర్నూలు కల్చరల్: జిల్లా గోరక్షణ శాలలో గాయత్రీ గోసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక పున్నమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గోమాత, గాడిపాటి పూజ, వృషభ గోపూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బదిలీ

కర్నూలు (అర్బన్): జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా ఆర్థిక సహకార సంస్థ కార్యాలయంలో ఈడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.విజయలక్ష్మి అనంతపురం జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ ఎంఎం నాయక్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కార్పొరేషన్ ఈడీ కె.తులసిదేవి తెలిపారు.

బైన్‌దొడ్డి రోడ్డును పరిశీలించిన డీఈఈ


రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ఐ డీఈఈ కర్రెన్న

కోడుమూరు రూరల్: మండలంలోని కల్లపరి రోడ్డు నుంచి బైన్‌దొడ్డి గ్రామానికి ఉపాధి నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం పీఆర్ఐ డీఈఈ కర్రెన్న పరిశీలించారు. నిర్ణయించిన కొలతలు, క్వాలిటీ ప్రకారం రోడ్డును నిర్మించారా? లేదా? అన్న వాటిపై డీఈఈ స్వయంగా తనిఖీ చేయడంతో పాటు, మండల ఇంజినీర్ గంగరాజును అడిగి వివరాలు తెలుసుకున్నారు. వీరివెంట ఎంపీడీఓ రాముడు ఉన్నారు.


నేడు కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం

కల్లపరి రోడ్డు నుంచి బైన్‌దొడ్డి గ్రామం వరకు నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పీఆర్ఐ డీఈఈ కర్రెన్న తెలిపారు.

ఆలయంలో చోరీ

దేవనకొండ: మండలంలోని నల్లచెలిమల గ్రామంలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు గుడిలోకి ప్రవేశించి హుండీ తాళాలు పగలగొట్టి బంగారం, వెండి కానుకలతోపాటు నగదును మూటగట్టుకుని ఉడాయించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రతిభ పురస్కార గ్రహీతకు సన్మానం


విద్యార్థి, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఒకేషనల్ కాలేజీ సిబ్బంది

కర్నూలు సిటీ: ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభ పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ కాలేజీలో ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థితో పాటు, అతని తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కాలేజీలో ఎం.పీ.హెచ్.డబ్ల్యూ (ఫిమేల్) గ్రూప్‌నకు చెందిన విద్యార్థిని ఎస్లావత్ ఉషా బాయ్ 924 మార్కులు సాధించారన్నారు. ఎం.పీ.హెచ్.డబ్ల్యూ విభాగంలో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించడంతో ప్రతిభ పురస్కారం అందుకున్నట్లు చెప్పారు. వొకేషనల్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఆ కాలేజీ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుపై అవగాహన పెంచుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వర్, అధికారులు

కర్నూలు (హాస్పిటల్): అధిక రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మహేశ్వర ప్రసాద్ సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు మాసోత్సవాల్లో భాగంగా కర్నూలు రైల్వేస్టేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక వ్యాయామం లేకుండా కూర్చొని పనిచేస్తే ఆరోగ్యం పాడవుతుందన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పులతో ఎక్కువ మంది అధిక రక్తపోటు బారిన పడుతున్నారని తెలిపారు. బీపీ, షుగర్, క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. ఇందుకోసం ప్రతిరోజూ అరగంట నడక లేదా వ్యాయామం చేయాలన్నారు. అనంతరం రైల్వే ఉద్యోగులకు, ప్రయాణికులకు రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థినులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మార్కెట్ యార్డు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగసౌమ్య, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు వెంటనే ఇవ్వాలి


మాట్లాడుతున్న వి.ప్రవీణ్

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు నిర్వహణ కోసం ఇస్తామన్న రూ.15 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే ఇవ్వాలని టీయూసీఐ జాతీయ కమిటీ సభ్యుడు, ఏపీ ఇన్‌చార్జ్ వి.ప్రవీణ్‌కు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తామని 2024 మే 13వ తేదీన టీడీపీ, బీజేపీ, జనసేన సంయుక్తంగా ప్రకటన చేశాయని గుర్తు చేశారు. మంగళవారం గాయత్రీ ఎస్టేట్‌లోని ఓ హోటల్‌లో ఏపీ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్స్ వర్కర్స్ యూనియన్ కర్నూలు పట్టణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆటో వర్కర్లకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గిస్తామని, ఇళ్లు లేని వారికి స్థలాలు ఇస్తామని చెప్పినా ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో టి.తిరుపాల్, మహేష్, పుల్లన్న,వెంకటేశ్వర్లు,రాజేష్, మధు, రాజా,సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం


బొల్లవరంలో విలేజ్ హెల్త్ సెంటర్ వద్ద పేరుకుపోయిన చెత్త

కల్లూరు: కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్ వద్ద చెత్త చేయడంతో దిబ్బలా మారింది. మంగళవారం సీపీఎం బృందం ఆ విలేజ్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎ.కృష్ణ మాట్లాడుతూ.. గ్రామంలో వెలువడే చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి అక్కడ వేయడం వల్ల దుర్వాసన వస్తోందని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. గ్రామంలో చెత్త సేకరణ పనులు నిలిచిపోయాయి. మూడు సంవత్సరాలైనా డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయలేదు. కల్వర్టుల వద్ద చెట్లు మొలిచాయి. కాలువల నుంచి దుర్వాసన వస్తోంది. పంచాయతీ కార్యదర్శి ఉన్నా లేనట్టుగానే గ్రామం ఉంది. మండల అధికారులైనా స్పందించి బొల్లవరం గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే గ్రామంలోని ప్రజలను సమీకరించి మండల పరిషత్ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. నాయకులు పి.నాగశేషులు, నీలన్న, తంబలి కిష్టన్న తదితరులు ఉన్నారు.

పెద్దాసుపత్రి ‘సెక్యూరిటీ’లో రచ్చ

- కొత్తగా వచ్చిన ఏజెన్సీ హడావుడి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొత్తగా సెక్యూరిటీ ఏజెన్సీని దక్కించుకున్న వ్యక్తుల హడావుడి మొదలైంది. ఆసుపత్రిలో సెక్యూరిటీ కాంట్రాక్టును కొన్నేళ్లుగా ఎక్స్‌పర్ట్ అనే సంస్థ నిర్వహిస్తోంది. వీరి గడువు ముగియడంతో కొత్తగా ఈగల్ అనే సంస్థ ఏజెన్సీని దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధిగా ఓ వ్యక్తి అధికారులను కలిశారు. మూడు రోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది డ్రస్‌కు ఉన్న ఎక్స్‌పర్ట్ ట్యాగ్ తొలగించాలని చెప్పారు. కొత్తగా యూనిఫాం ఇస్తేనే ఆ ట్యాగ్ పోతుందని కొందరు సెక్యూరిటీ ఉద్యోగులు సమాధానం ఇచ్చారు. మాకు ఎదురు చెబుతారా, మాకు ఎదురు చెప్పిన వారందరినీ ఉద్యోగం లోంచి తొలగిస్తామని చెప్పినట్లు ఆసుపత్రిలో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎంత జీతం ఇస్తున్నారని ఆరా తీయగా రూ.9 వేలకు పైగానే వస్తోందని సెక్యూరిటీ గార్డులు సమాధానం ఇవ్వగా, తాము మాత్రం రూ.8,400 ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. వేతనం పెంచాల్సింది పోయి ఇంకా తగ్గిస్తారా అని వాదన జరిగినట్లు సమాచారం. తాము చెప్పినట్లు పనిచేయాలని, ఎదురు ప్రశ్నించిన వారిని తొలగిస్తామని చెప్పడంతో ముందు మీ అగ్రిమెంట్ కాపీ చూపించాలని కొందరు సెక్యూరిటీ గార్డులు ప్రశ్నించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం ఆసుపత్రి అధికారుల దృష్టికి వెళ్లగా ప్రస్తుతం పనిచేస్తున్న సెక్యూరిటీ ఉద్యోగులను పిలిచి మందలించినట్లు సమాచారం. ఈగల్ అనే సంస్థకు సెక్యూరిటీ ఏజెన్సీ దక్కిందని, త్వరలో వారు బాధ్యతలు తీసుకుంటారని అధికారులు వారికి సర్దిచెప్పి పంపించారు. కొత్తగా ఏజెన్సీ రావడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఎంత మంది ఉంటారో, ఎంత మంది ఉద్యోగాలు పోతాయో, కొత్తగా ఎవరిని తీసుకుంటారోనని ఆసుపత్రిలో చర్చ జరుగుతోంది.

విద్యా సంస్థల్లో విక్రయాలు తగదు



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు సిటీ: రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు చెందిన విద్యాసంస్థల్లో పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేయడం దారుణమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పలు విద్యాసంస్థల్లో అనుమతులు లేకుండా పుస్తకాల విక్రయాలు చేపట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ, నగర కమిటీ ఆధ్వర్యంలో ఆయా విద్యా సంస్థల ఎదుట ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కమిటీ కార్యదర్శి సాయి ఉదయ్ మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయన్నారు. సేవే పరమావధిగా పనిచేయాల్సిన విద్యా సంస్థలు ఫీజుల పేరుతో దోపిడే లక్ష్యంగా పని చేస్తున్నాయని విమర్శించారు. నిబంధనల అతిక్రమణపై విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యాసంస్థలు చేస్తున్న చట్ట వ్యతిరేక పనులపై ఆధారాలతో విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోడం లేదని వాపోయారు. కనీసం ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడాలని, కార్పొరేట్ విద్యా సంస్థలు ఒక బ్రాంచ్‌కు అనుమతులు తీసుకొని మరికొన్ని బ్రాంచ్‌లనుఅక్రమంగా నడుపుతున్నారన్నారు. విద్యా సంస్థల్లోకి వెళ్లి అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్నట్లు ఆధారాలతో చూపిస్తున్నామని, డీఈఓ స్పందించి ఆయా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలను సీజ్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఆ సంఘం నాయకులు అంజి, మల్లేష్, పృథ్వీ, ఆదిత్య, చరణ్, హర్ష, సాయి,. భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.